కనుల పండువగా పుట్టలమ్మ తల్లి సంబరాలు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పు దేవత పుట్టలమ్మ తల్లి, ఘంటాలమ్మ తల్లి సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, వ్రతాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు దెందులూరి రాంబాబుశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో కృష్ణా జిల్లా దేవరకోటకు చెందిన బృందంతో శ్రీలక్ష్మి తిరుపతమ్మ తల్లి నాటక ప్రదర్శన ప్రదర్శించారు. రాత్రి అమ్మవారి ఊరేగింపును ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు స్వామివారి ఊరేగింపునకు దారిపొడవునా వారుపోసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. అమ్మవారికి చీర, సారెలు, పసుపు కుంకుమలు



గ్రామోత్సవంలో పుట్టలమ్మ తల్లి

ఇచ్చి ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ మహిళల వాయిద్యాలు భక్తులను ఆకర్షించాయి. కళాకారుల దేవతామూర్తుల



దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

వేషధారణలు భక్తులను మైమరిపించాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి మాట్లాడుతూ 15వ తేదీ ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. రాత్రి 8 గంటలకు లడ్డూ వేలం జరుగుతుందన్నారు. వేలంలో లడ్డూను కైవసం చేసుకున్న భక్తులకు 9 గ్రాముల బంగారు లాకెట్‌ను ఆలయ కమిటీ ఇంటూరి వీరారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అందజేస్తారన్నారు.

ఆర్టీసీ స్థలం లీజుకు టెండర్ల ఆహ్వానం

పొన్నూరు: ఆర్టీసీ ఖాళీ స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు టెండర్‌లు పిలిచినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఆయన మాట్లాడుతూ డిపోలో ఉన్న 1.5 ఎకరాల ఖాళీ స్థలాన్ని 15 సంవత్సరాలకు అద్దె ప్రాతిపదికపై లీజుకు ఇచ్చేందుకు టెండర్‌లు పిలవడం జరిగిందన్నారు. టెండర్ వేసేందుకు ఫిబ్రవరి 3 తేదీ ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.apsrtc.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

కాకుమాను: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కాకుమానులో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు ట్రాక్టర్ రివర్స్‌లో పడిపే పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ నల్లమోతు శివరామకృష్ణ మాట్లాడుతూ 2023 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో జీవించాలనే ఉద్దేశంతో గ్రామంలో పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలకు గుంటూరు జిల్లా రిటైర్డ్ జడ్జి రేచల్ దేవవరం, ముప్పవరపు విజయలక్ష్మి, బొమ్మకాలి నీలిమ, కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ప్రముఖ పారిశ్రామికవేత్త నల్లమోతు (ఏరీస్) రత్తయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, పంగులూరి శ్రీనివాసరావు తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లమోతు వీరయ్య, పోతినేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దేటమ్మ తల్లి అభిషేకం

పొన్నూరు: పెద్దేటమ్మ తల్లికి 108 శంకులతో అభిషేకం నిర్వహించినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. మామిళ్లపల్లి గ్రామంలో వేంచేసిఉన్న పెద్దేటమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్టాపన మహాకుంభాభిషేకం గత నెలలో నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. కంకణ విసర్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవం

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో గోదాదేవి కల్యాణోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక రంగనాథస్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణం భక్తిశ్రద్ధలతో సాగింది. గోదాదేవి కల్యాణోత్సవం చేబ్రోలు, శ్రీరంగపురం, శలపాడు, మంచాల గ్రామాల్లోని దేవాలయాల్లో కనుల పండువగా జరిగాయి.

అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి



ఆభరణాలతో ఆలయానికి బయలుదేరిన గురుస్వామి మాకిరెడ్డి వెంకటరెడ్డి, భక్తులు

పెదకాకాని: హరిహర సుతుడు అయ్యప్పస్వామికి భక్తులు ప్రత్యేక అభిషేక పూజలు, కర్పూర హారతులు అందించి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. వెనిగండ్ల గ్రామంలో శనివారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం, శబరిమల అయ్యప్పస్వామి సన్నిధిలో మకరజ్యోతి దర్శనాన్ని పురస్కరించుకుని స్వామి వారికి అభిషేకాలు జరిపారు. గుంటూరుకు చెందిన పద్మజ జ్యూయలర్స్ యజమాని భూషా చంద్రారెడ్డి స్వామి వారి అలంకరణకు ఆభరణాలు తయారు చేయించి సమర్పించడంతో పాటు ప్రతి ఏటా 21 కిలోల కర్పూరం అందజేస్తున్నారు. ఆభరణాలు, మకరజ్యోతిగా వెలిగించే కర్పూరాన్ని మాకిరెడ్డి వెంకటరెడ్డి గురుస్వామి ఇంటి నుంచి మేళతాళాలతో గ్రామోత్సవంగా బయలుదేరి ఆలయానికి చేరుకున్నాయి. అనంతరం అయ్యప్పస్వామి 18 మెట్లకు పూజలు చేసి, కర్పూర జ్యోతిని వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కిలారి



పొన్నూరు: సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాల కాంతులు నింపాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.

సంస్కృతి, సంప్రదాయాల వేడుక సంక్రాంతి

పెదకాకాని: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ అన్నారు. పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో భోగి పర్వదినం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. ఐద్వా, డీవైఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఐక్యతగా ఉండేందుకు ఈ ఆటల పోటీలు దోహదపడతాయన్నారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, శివప్రసాద్, జె.రాజ్యలక్ష్మి, బి.సాంబయ్య, కె.రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక భోగి పండ్లు వేడుక

మిద్దె రథంపై స్వామివారి గ్రామోత్సవం

పెదకాకాని: శివాలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని భోగి పండుగ రోజున ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో చిన్నారులకు భోగి పండ్లు పోసే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకస్వాములు, వేద పండితులు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మేళతాళాలు, వేదమంత్రాల నడుమ చిన్నారులకు భోగి పండ్లు కార్యక్రమం నిర్వహించారు. సుమారు 100 మంది చిన్నారులకు ఆలయ ప్రాంగణంలో తల్లుల చేతుల మీదుగా భోగి పండ్లు పోసి ఆశీస్సులు అందించారు. అనంతరం



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, వేదపండితులు

స్వామివారి ప్రసాదాలు పంపిణీ చేశారు. భోగి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలతో అలంకరించిన మిద్దెరథంపై భ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి గ్రామ వీధుల్లో గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం జరిగే గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి కోరారు.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు



భోగి మంటలు వేస్తున్న దృశ్యం

పొన్నూరు: ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ కోదండ రామాలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక తెలగపాలెంలోని కోదండ రామాలయంలో అర్చకులు చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు బృందం స్వామివారికి విశేష పూజలు నిర్వహించి, భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో దేవరాజస్వామి, ఆచార్యులు తిరుప్పావై పారాయణ సంఘం ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



బాబ్జి మృతదేహం

పెదకాకాని: గుంటూరు చానల్‌లో గల్లంతై మృతి చెందిన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. పెదకాకాని సంకూరివారిపేటకు చెందిన బొట్టు బాబ్జి పొలం పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబ్జి గురువారం అతని బాబాయి రాజశేఖర్, మరో స్నేహితుడు కనపర్తి మరియదాసుతో కలిసి పెదకాకాని శివారులోని గోళ్లమూడి రోడ్డులో ఉన్న గుంటూరు చానల్ (కొత్త కాలువ)కు బహిర్భూమికి వెళ్లాడు. నీటిలో పడి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాబ్జి (35) కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన మృతదేహం శనివారం పొక్లెయిన్ సహాయంతో వెలికితీశారు. పోస్టుమార్టం అనంతరం బాబ్జి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అయితే మృతుడి భార్య బట్టు రమ్య తన భర్త బాబ్జి మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. మృతుడితో పాటు గుంటూరు చానల్‌కు వెళ్లిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

స్నేహబంధం ఎంత మధురం

31 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



కళాశాల అధ్యాపకులతో పూర్వవిద్యార్థులు

పెదనందిపాడు: స్నేహితులంతా ఒక్కచోట చేరారు. నాడు కళాశాలలో చేసిన అల్లరిని గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. శనివారం ఉదయం 31 ఏళ్ల తర్వాత 1987–1992 ఇంటర్మీడియెట్, బీఎస్సీ విద్యార్థుల అపూర్వ కలయికతో పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పులకించిపోయింది. ఈ సందర్భంగా తమ అభ్యున్నతికి మార్గం చూపిన గురువులు, కళాశాల అధ్యాపకులు శ్రీధర్, వెంకట్రావు, రాధాకృష్ణమూర్తి, ద్వారకమణి, ఈశ్వరరావును విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య, పీడీ శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.